# తొణికిన స్వప్నం

## -ఎమ్.వి.వి.సత్యనారాయణ

కాన్వెంట్ గేట్‌కి కూడా తాళంవేసి ఒకసారి తాళం కప్ప లాగి చూసి మరీ బయలుదేరాడుగానీ మావుళ్లయ్యకి మనసు మనస్సులో లేదు. చెయ్యవలసిన పనేదో చెయ్యకుండా పోయినట్లు ఆలోచన ఒకటి మెదడును దొల్చి పారేస్తోంది. ఏ పని మర్చిపోయాడో మాత్రం తెలియడంలేదు. తాళం చెవుల గుత్తిని భోజనం కారియర్‌తోపాటు సంచిలో పెట్టుకున్నాడు.

పూరవతల కట్టిన కాన్వెంట్. అక్కడ్నుంచి సైకిలెక్కి బయలుదేరాడు మావుళ్లయ్య.

తానేం మర్చిపోలేదే! సైకిల్ తొక్కుతున్నాడన్న మాటేగానీ మనస్సంతా ఆ రోజు ఉదయం నుంచీ జరిగిన సంఘటనల్ని నెమరేస్తోంది.

ఉదయం మామూలుగానే ప్రిన్సిపాల్‌గారింటికి వెళ్లి తాళాల గుత్తి తీసుకుని కాన్వెంట్ చేరుకున్నాడు. అప్పటివరకూ అతని కోసమే కాచుకుని వుంటాడు వాచ్‌మేన్. ఇద్దరూ కలసి రోడెక్కి కాకా హోటల్‌లో టీ తాగుతారు. తర్వాత వాచ్‌మేన్ వెళ్లిపోతాడు. గేటు తెరిచి ప్రిన్సిపాల్‌గారి ఆఫీస్ రూం తెరుస్తాడు. రూం శుభ్రపరిచి ఆయన బల్ల సర్దిపెడతాడు. మంచినీళ్లు పడతాడు. ఇంతలో స్వీపర్ వస్తుంది. గేటువద్ద, వరండాలూ వూడ్చడం మొదలుపెడుతుంది.

ఇదంతా ఎప్పుడూ వున్నదే. ఈ రోజు కొత్తకాదు. ఈరోజు అంతా అలాగే జరిగింది. మరెక్కడ తేడా జరిగింది?

క్లాస్‌రూమ్‌లన్నీ దగ్గరుండి తుడిపిస్తాడు మావుళ్లయ్య. అలా తుడిపించాలని ప్రిన్సిపాల్‌గారి హుకుం. ముందురోజు పిల్లలు పారేసుకున్న వస్తువులకు మావుళ్లయ్యే జవాబుదారీ.

నెలకిచ్చే వెయ్యిరూపాయల జీతం మావుళ్లయ్యమీద ఇన్ని బాధ్యతల్ని చేర్చి పెట్టింది.

ఈరోజు కాన్వెంట్ పిల్లల వస్తువులేవీ దొరకలేదు. అంతవరకూ నయం.

తొమ్మిదిగంటలకు మామూలుగానే స్కూలు బస్సు వచ్చింది. బస్సులో డెబ్బైరెండుమంది పిల్లలు, నలుగురు టీచర్లు, ఒక డ్రిల్ మాస్టారు వస్తారు. బస్సుతోపాటు వచ్చిన డ్రైవర్, క్లీనర్ బస్సును షెడ్లో పెట్టి వేరే డ్యూటీలకు వెళ్లిపోతారు. తరగతి గదుల్లోకి పిల్లలు వెళ్లిపోయిన తరువాత కూడా కార్యక్రమాలు సజావుగానే అమలు జరిగాయి.

మరి తేడా ఎక్కడొచ్చింది!

రవీంద్రనగర్ దాటుతుండగా ఒక కుర్రాడు అతడి సైకిలికి అడ్డం పడ్డాడు. అతన్ని తప్పించబోయి రోడ్డు పల్లానికి దిగిపోయాడు మావుళ్లయ్య. కుర్రాడు కూడా బెదిరిపోయి కిందపడ్డాడు.

తల విదిలించాడు మావుళ్లయ్య.

ఛ ఛ... ఏం మర్చిపోయాడో గుర్తొచ్చి చావడంలేదు. ఏదో కొస అందినట్టే అంది అంతలోనే మాయమౌతోంది. ఆలోచన పూర్తిగా రావడంలేదు.

సాయంకాలం పిల్లలంతా బస్సెక్కి వెళ్లిపోయారు. టీచర్లు, డ్రిల్ మాస్టారు కూడా. ఎప్పుడులాగానే సాయంకాలం నాలుగు గంటల పది నిముషాలకు తరగతుల గది తలుపులన్నీ మూసుకుని గేటు తాళం పెట్టుకుని బయలుదేరాడు మావుళ్లయ్య. ప్రిన్సిపాల్‌గారి గదికి ప్రిన్సిపాల్‌గారే తన దగ్గరుంచుకునే తాళం చెవితో తాళం వేసుకుని వెళ్లిపోయారు. అందువల్ల ఆ గది బాధ్యత ఈ రోజు తప్పింది.

ఇంక ఏ సంగతి మర్చిపోయాడు? ఎందువల్ల గుర్తొచ్చి చావడంలేదు. తిరిగి సైకిలెక్కాడు మావుళ్లయ్య.

హనుమంతునివాక వంతెన దగ్గర సైకిలుకు సడెన్‌బ్రేక్ పడిపోయింది. కాన్వెంట్ బస్సులో పిల్లల్ని లెక్కపెట్టాడా తను. ఉదయం వచ్చినప్పుడు డెబ్బై యిద్దరు. సాయంకాలం తిరిగి వెళ్లేటప్పుడు లెక్కపెట్టాడా తాను. లేదనుకుంటాను. అనుకున్నాడు మావుళ్లయ్య.

అనుకోవడమేమిటి! లేదు!

అదే సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఇందాకట్నించి తల పగులగొట్టుకుంటుంటే ఇప్పుడా గుర్తుకు రావడం? ఎందువల్ల పిల్లల్ని లెక్కపెట్టలేదు.

సైకిలు దిగి నడవడం మొదలుపెట్టాడు మావుళ్లయ్య.

డ్రిల్ మాస్టారు అప్పుడే తనని పిలిచాడు. ఆయన్ని చూస్తే తనకి వణుకు పుడ్తుంది.

''రెండు నిముషాలుండండి మాస్టారు. ఇప్పుడే వస్తాను'' అన్నాడు తాను.

''అర్జంట్‌రా మావుళ్లూ'' అన్నారు డ్రిల్ మాస్టారు.

క్షణం కూడా ఆగడాయన. లేడికి లేచిందే ప్రయాణమన్నట్లు కొట్టుమిట్టాడిపోతాడాయన. ఆ తర్వాత ఆయన మావుళ్లయ్యను కాన్వెంట్ వెనక్కి తీసుకుపోయాడు.

''ఈరోజు రాత్రి ఎనిమిది గంటల తరువాత నువ్వు ఇక్కడికి రావాల్సి వుంటుంది'' అన్నాడు డ్రిల్ మాస్టారు.

''ఎందుకు బాబుగారూ?''

''నాకు పనుంది నువ్వు రా. గేటు దగ్గరే వుంటాను''

''చీకటి బాబుగారూ. అయినా మనం మళ్లీ...''

''హుష్! ఎవరికీ తెలియకూడదు. డైరీఫారం వెనకనుంచి నా కోసం ఒక స్నేహితుడొస్తారు''

''అంత రాత్రి వేళా బాబుగారూ?''

మనోహరంగా నవ్వాడు డ్రిల్ మాస్టార్. ఆ నవ్వునుబట్టే ఆయన చీకటి వ్యవహారామేమిటో అర్థమయింది. మావుళ్లయ్యకిలాంటి వ్యవహారాలు పరమ చిరాకు. పురుగూ పుట్రా తిరిగే చోట సంబరం, సంతోషం ఎలా జరుపుకుంటారో, ఆ వచ్చే ఆడదానికైనా ఎంత తెగింపు వుంటుందో అర్థం చేసుకోలేకపోయాడు మావుళ్లయ్య.

''నేనేం చేయాలి బాబుగారూ'' అడిగాడు మావుళ్లయ్య అదోరకంగా చూసి.

''కాస్త ఆసరా. ఒక అరగంటలో మనం తిరిగి వెళ్లిపోవచ్చు.''

మనసులోనే చీదరించుకున్నాడు మావుళ్లయ్య డ్రిల్ మాస్టార్ని. కాదనడానికి లేదు. తనకి అతడే కాన్వెంట్‌లో ఉద్యోగం ఇప్పించాడు. తననుంచి అతడెలాంటి ఉపకారమూ ఆశించలేదు. ఇదిగో ఇప్పుడిలాంటి కాని పనిలో ఆసరా కోరుతున్నాడు.

ఏం చేయాలి? అన్యమనస్కంగానే గేటు దగ్గరకొచ్చేసరికి కాన్వెంట్ బస్సు ఎటూ హైవే రోడ్డెక్కేసింది. కేకపెట్టే వ్యవధి లేదు. ముప్పయ్ అయిదు తరగతి గదులూ మూసి తాళాలు పెట్టుకురావాలి. సాయంకాలం అయిదున్నర గంటల్లోపుగా ప్రిన్సిపాల్‌గారింట్లో తాళం చెవులిచ్చి మరీ ఇంటికి వెళ్లాలి.

లేకపోతే ప్రిన్సిపాల్‌గారింట్లో ఎవరూ వుండరు. ఆరు దాటకుండానే దేశంమీద పడ్తారు.

మావుళ్లయ్యకి డ్రిల్ మాస్టార్‌మీద బాగా మండుకొస్తోంది. తన బుర్రంతా ఖరాబు చేసాడు. వెంకోజీపాలెంలో ప్రిన్సిపాల్‌గారింట్లో తాళం



చెవులెలా అందించాడో కూడా గుర్తులేదు. అంత పరాకుగా సైకిల్ నడిపించుకుంటూ వచ్చాడు మావుళ్లయ్య.

ప్రిన్సిపాల్‌గారింట్లో ఎవర్ని ఏ రకంగా పలకరించాడో గుర్తులేదు. బస్సులో పిల్లల్ని లెక్కపెట్టలేకపోయాడు. ఒక్కటే ఈ ఏడాదిలో తాను చేసిన ఘోర తప్పిదం. ఆ ఒక్క తప్పూ ఈ రోజు జరిగిపోయింది. ఈ ఆలోచనలతోనే ఇంటికి చేరుకున్నాడు. భార్య పలకరించి మంచి నీరందించింది. తర్వాత టీ పెట్టి ఇచ్చింది.

''హనుమంతవాక దగ్గర చేపలు పెట్టలేదా?'' అడిగింది పెళ్లాం.

ఏదో చెప్పాడు.

తనచేత ఒక తప్పు చేయించాడు డ్రిల్ మాస్టార్. ఇప్పుడు రెండో తప్పు చేయించడానికి సిద్ధపడ్డాడు. రాత్రి ఎనిమిది గంటలకు తిరిగి కాన్వెంట్‌కి రమ్మంటాడు. అక్కడ ఎవత్తెతోనో.... అతడికి ధైర్యం కలగడంకోసం తాను కాపలా వుండాలి.

''పెట్రోల్ బంక్ దగ్గరకెళ్లి కూరగాయలైనా పట్టుకురా'' అంది పెళ్లాం.

లాయర్ మీనాక్షి అదే సమయానికి లేడీస్ క్లబ్‌లో ప్రసంగం మొదలుపెడుతోంది. లా ప్రాక్టీస్ కంటే లెక్చర్లివ్వడానికి మీనాక్షి ప్రాముఖ్యతనిస్తుందని స్థానికులు ఎద్దేవా చేస్తుంటారు. అయినా మీనాక్షి తన విమర్శకులను ఖాతరు చేయదు. అంత ఎందుకు మొగుడ్నే లెక్క చేయదని చెప్పుకుంటాడు సదరు మొగుడే.

స్టీలూ సిమెంటు అమ్ముతాడు మీనాక్షి మొగుడు. షాపు కట్టి ఏ తొమ్మిదింటికో వచ్చేటప్పటికి ఆవిడగారుండరు. పట్టుచీరలు, ఫుల్ మేకప్ మిళాయించుకుని మురికివాడల ప్రజలకు పిల్లల పెంపకానికి సంబంధించి చిట్కాలు చెప్పడానికి వెళుతూ వుంటుంది.

అలసిసొలసి ముక్కుతూ మూలుగుతూ తొమ్మిది తర్వాతెప్పుడో ఇల్లు చేరుకుంటుంది. వంటమనిషి వండి పారేస్తుంది కాబట్టి మొగుడూ పెళ్లాలకు ఒక పాపకి తిండి వుంటుంది. అసలు సాయంకాలం నాలుగున్నరకి కాన్వెంట్ బస్సు దిగి పాప ఇల్లు చేరే సమయానికి ఇల్లంతా బోసిపోయి వుంటుంది. తోటమాలి ఒక్కడే వుంటాడు.

డైనింగ్ టేబుల్‌మీద బ్రెడ్డు, పాలు వుంటాయి. వంటావిడ అమర్చి పెట్టి ఇక తన ఇల్లు చక్కపెట్టుకోవడానికి వెళ్తుంది. తిరిగి రాత్రి ఏడుగంటల ప్రాంతాల్లో వంట చేయడానికొస్తుంది.

ఈలోపులో లాయర్ మీనాక్షి సమావేశం మధ్యలో వుండగా పాప ఒక్కసారి తండ్రికి ఫోన్ చేస్తుంది. కాసేపు టీవీ దగ్గరో, వీడియోగేమ్స్ పెట్టుకుని కాలక్షేపం చేస్తుంది. తోటమాలితో కబుర్లు చెబుతుంది. కాన్వెంట్‌లో ఇంటిపని ఇచ్చి వుంటే అది కాస్తా రొప్పుతూ రోదిస్తూ అయిపోయిందనిపిస్తుంది.

లంకంత ఇంట్లో బంగారుబొమ్మలాగా ఆరేళ్లపాప తిరుగుతుంటే తోటమాలికి కళ్లు చెమర్చుతాయి.

''ఒక్క పాప. అలాగే అయిదేళ్ల నుంచి కుటుంబ నియంత్రణ పాటిస్తున్నానంటే'' ఆగింది మీనాక్షి.

అప్పటికి అరగంటయ్యింది ఆమె ప్రసంగం మొదలుపెట్టి. ఇంటినెలా చక్కపెట్టుకోవాలో, ఆలుమగలు ఎలా సంసార బాధ్యతలు చక్కపెట్టుకురావాలో సిద్ధాంతాలు ప్రవచిస్తుంది. నెలంతా ఆ మూటకొస్తే సంవత్సరమంతా ఇక అదే పని.

మురికివాడల ప్రజలు నోళ్లావులించి వింటారు. కొంతమందైతే ఈవిడ ఎంత త్వరగా విడిచిపెడ్తుందో కేబుల్ సినిమా కోసం తమ కమ్యూనిటీ సెంటర్లో దూరదామా అని చూస్తుంటారు.

కారులో తొమ్మిదిన్నరకు ఇంటికొచ్చింది మీనాక్షి. అప్పటికి మీనాక్షి మొగుడూ, కూతురూ కలసి భోజనం అయ్యిందనిపించుకునుండాలి. కానీ అలా లేదు. మీనాక్షి మొగుడొక్కడే పోర్టికోలో

గచ్చుమీద కూర్చున్నాడు. అతడి మొహంలో కళాకాంతుల్లేవు.

మొగుడెప్పుడూ అంతే! ఏదో పోగొట్టుకున్నట్టుంటాడు. షాపు మీద వచ్చే లాభాలు చాలవంటాడు. కట్టుకుపోయినంత ఆస్తి వుంది. ఆయనకి తృప్తిలేదు.

''ఎందుకలా వున్నారు?'' అడిగింది మీనాక్షి.

కారు రావడం కూడా మొగుడు గమనించలేనట్టుంది. ఆమెను దెయ్యాన్ని చూసినట్లు చూశాడు.

తొమ్మిది ముప్పయి అయిదుకి డ్రిల్ మాస్టార్ ఆ చీకట్లో ఆ మూల తుప్పలకివతల జంఖానా గుడ్డమీద ఆ పిల్ల కౌగిట్లో వుక్కిరిబిక్కిరి అవుతున్నాడు. దోమల బాధ, కీచురాళ్ల రొదా, సముద్రం మీద నుంచి దూసుకొస్తున్న రొద, గాలీ, సౌకర్యంగాలేని జంఖానా గుడ్డా, నేలలోంచి గుచ్చుకుంటూన్న గడ్డి దుబ్బులూ, పురుగూ పుట్రా వస్తుందన్న బెదురు వీటన్నింటిని మించి మావుళ్లయ్య సొద.

చెట్టుకవతల చాటున కూర్చున్నాడు మావుళ్లయ్య. చీటికీ మాటికీ దోమల్ని కొట్టుకుంటూ తన చిరాకు అణచుకోవడానికో, తన చిరాకు ప్రదర్శించడానికో మూలుగును విడుదల చేస్తున్నాడు.

ఎక్కడ్నించో సన్నపాటి ఏడుపు.

డ్రిల్ మాస్టారు లేచి కూర్చున్నాడు. దెయ్యంపిల్ల ఏడుస్తున్నట్లు... ఛ ఛ... తాటిచెట్లమధ్య నుంచి వెర్రిగాలి ఈల వేసినట్లు-

''మావుళ్లయ్యా'' పిల్చాడు డ్రిల్ మాస్టారు.

''బాబుగారూ'' అన్నాడు అవతల్నించి.

''ఏడుపు వినిపించిందా?''


''ఎవరో పిల్ల బాబుగారూ''

''ఎక్కడ్నుంచి? దగ్గర్లో ఇళ్లు లేవుకదా?''

''దెయ్యాలో, దేవతలో బాబుగారూ,... ఇక వెళ్లిపోదామా''

డ్రిల్ మాస్టారుకి మూడ్ దిగిపోయింది. దెయ్యమే తన కౌగిట్లోకి చేరినట్లు భావన తొలుస్తోంది. ఆమెను వదిలిపెట్టి చటుక్కున లేచి కూర్చున్నాడు. అతడ్ని మీదకి లాక్కోబోయిందా పిల్ల.

సరిగ్గా అప్పుడే ఆ పిల్ల మొహంమీద దీపం వెలుతురు ఫోకస్ అయింది. ఒక




దీపం, తర్వాత మరో దీపం.

జుత్తు రేగిపోయి, బొట్టు చెరిగిపోయి ఒక వికార స్వరూపం లాగా వుంది ఆ పిల్ల. డ్రిల్ మాస్టార్ గబుక్కున లేచి నిలబడి దీపాలు కన్పించిన వైపు చూసాడు. కాన్వెంట్ ముంగిట కారు వచ్చి ఆగింది.

డ్రిల్ మాస్టారు గుండె జారిపోయింది.

ఎవరో ఇన్‌స్పెక్షన్‌కి వచ్చారో, తన బాగోతం తెలిసే వచ్చారో తనకిలాగానే ఎవరినైనా తీసుకు తెచ్చుకున్నారో -

వాచ్‌మెన్ మాటలూ, ఒక ఆడ గొంతు కలసి వినిపిస్తున్నాయి.

''కాన్వెంట్‌లో ఎవరూ వుండిపోలేదండీ'' అంటున్నాడు వాచ్‌మెన్.

''మా అమ్మాయి ఇంటికి రాలేదు. బస్సులో అందరూ ఎక్కారా?'' మరో మగ గొంతు.

''ఎక్కే వుంటారు. అటెండర్ చూసుకుంటాడు''

''నువ్వుండవా అప్పుడు?''

''చీకటి పడ్డాక నేనొస్తానండీ''

''అతడి ఇల్లెక్కడ?''

''వెంకోజీపాలెం''

''తాళాలు తీయించాలి. క్లాస్‌రూంలో వుండిపోయిందేమో?''

''అలా ఎవ్వరూ వుండిపోరండీ''

''మరేమైపోతుంది. బస్సు మా ఇంటికి దగ్గరగానే ఆగుతుంది. నాలుగడుగులు వేస్తే సరి. ప్రిన్సిపాల్‌గారింటికి ఫోన్ చెయ్యిద్దాం.''

వాచ్‌మెన్ నిట్టూర్చాడు.

''ఒకసారి ప్రహరీగోడ చుట్టూ తిరిగొద్దామా?''

గేటు తెరచి తోట అంచునే కదిలారు వాళ్లు ముగ్గురూ. అప్పటికి బిచాణా సర్దిపెట్టి వుంచారు మావుళ్లయ్యా, ఆ డ్రిల్ మాస్టర్. ఆ పిల్లని తీసుకుని కాన్వెంట్ ప్రాంతం నుంచి ఉడాయించారు.

అలా వుడాయించకుండా వుంటే-

మీనాక్షి దంపతులకూ, వాచ్‌మెన్‌కూ, వెనుక గదివద్ద వినిపించిన రోదనం, వీళ్ల ముగ్గురికూడా వినిపించి వుండేది.

''అమ్మా'' అరుస్తోంది మీనాక్షి.

కిటికీ సందులోంచి ఆమె సృష్టించిన శబ్ద తరంగాలు ఆ పిల్ల చెవిన పడ్డాయో లేదో కానీ మీనాక్షి మొగుడు మొదటిసారిగా చివరిసారిగా చావిపెట్టి మీనాక్షి చెంప వాయించినప్పుడు వెలువడిన శబ్దం మాత్రం వాచ్‌మెన్‌కి భూకంపం ధ్వనిలాగా వినిపించింది.

మీనాక్షి అక్కడే కుప్పకూలిపోయింది.

వాచ్‌మాన్, కాన్వెంట్ తాళం చెవుల కోసం ఆమె మొగుడు భాస్కరరావు కారులో బయలుదేరారు హడావుడిగా.

''దేవుడా! నా పెళ్లాన్ని మార్చుకునే శక్తినిచ్చావు. నా బిడ్డను దక్కించుకునే అదృష్టం కూడా ఇవ్వు'' రోదిస్తోంది భాస్కరరావు అంతరంగం.

★



**రాము+జాము=ఊర్మిళ!**

సెక్సీణి 'ఊర్మిళ' ఇప్పుడు 'వర్మ'ను తృప్తిపరుస్తూనే, మరొకరితోనూ కనెక్షన్ పెట్టుకుందని బాలీవుడ్ పత్రికల బోగట్టా. ఆ కొత్త వ్యక్తి 'ఖూబ్‌సూరత్' చిత్ర నిర్మాత, 'దౌడ్' చిత్ర సమర్పకుడూ అయిన 'జామూసౌగంధ్'. దౌడ్ ఫ్లాప్ తర్వాత సౌగంధ్ ఊర్మిళను తన సొంత చిత్రంలోనుండి తీసేసి, 'సత్య'లోనూ వుండకూడదని కండీషన్ పెట్టేటంత, అప్పటికే వరుస ఫ్లాపులతో అవకాశాలు కనుమరుగైన ఊర్మిళకు జామూసౌగంధ్ అంటే ఏమిటో తెలిసివచ్చిందట. నెత్తిమీద కళ్లు కిందికి దిగాయి. మధ్యలో వర్మగారే వాళ్లిద్దరి మధ్య రాజీ కుదిర్చారట. అలా జామూసౌగంధ్‌కి దగ్గరయిన ఊర్మిళ ఇప్పుడు రాముతోకన్నా ఎక్కువగా జామూతోనే కనపడుతుందని చూసినవాళ్లు చెపుతున్నారు. అయితే ఊర్మిళ డైరెక్టర్‌ని నమ్ముకోవడంకన్నా, నిర్మాత-ఫైనాన్షియర్స్‌ని నమ్ముకోవడమే మంచిదనే నిర్ణయానికి వచ్చేసిందన్నమాట.

-జె.వి.బాబు